ఆంధ్రజ్యోతి ప్రవాస

# ఎంజీఎంఎన్‌టీ ఆధ్వర్యంలో ఘనంగా 71వ స్వాతంత్ర్యదినోత్సవం



**డల్లాస్, టెక్సాస్:** దాదాపు 1000 మందికి పైగా ప్రవాస భారతీయుల ఆనందోత్సాహాల మధ్య 71వ భారత స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. వందల మంది చిన్నారులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి అమెరికాలోని అతిపెద్ద గాంధీ మెమోరియల్ అయిన ఇర్వింగ్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజా వేదికైంది.

జాతిపిత మహాత్మగాంధీకి ఘనమైన నివాళులు అర్పించిన ఎంజీఎంఎన్‌టీ బోర్డు డైరెక్టర్ షాబ్నమ్ మోడ్గిల్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా చిన్నపిల్లలు ఆలపించిన దేశభక్తి గీతాలు కార్యక్రమంలో ఉత్సాహాన్ని నింపాయి. ఎంజీఎంఎన్‌టీ సెక్రటరీ రావు కాల్వల మాట్లాడుతూ.. శాంతి, అహింస పద్ధతుల ద్వారా దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టడంలో కీలకపాత్ర పోషించిన జాతిపిత మహాత్మగాంధీ మెమోరియల్ అయిన మహాత్మగాంధీ మెమోరియల్లో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకలు తనకు చాలా ప్రత్యేకమైనవని పేర్కొన్నారు. అక్టోబర్ 1న నిర్వహించనున్న గాంధీ పీస్ వాక్‌కు హాజరుకావాల్సిందిగా వేడుకల్లో పాల్గొన్నవారిని ఈ సందర్భంగా కోరారు.

అనంతరం ప్రవాసీయుల కోలాహలం మధ్య ఎంజీఎంఎన్‌టీ చైర్మన్ తోటకూర ప్రసాద్ తివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా భారత్, యూఎస్ జాతీయ పతాకాలను చేతులతో పట్టుకుని ప్రవాసీయులు ఉత్సాహంగా కనిపించారు. అనంతరం తోటకూర ప్రసాద్ మాట్లాడారు. భారత స్వాతంత్ర్యదినోత్సవాన్ని జరుపుకోవడానికి స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులను కల్పించిన అమెరికాకు ఋణపడి ఉండాలని ఆయన అన్నారు. అమెరికాలో భారత 71వ స్వాతంత్ర్యవేడుకలు జరుపుకుంటున్న తామంతా అదృష్టవంతులమని ఆయన పేర్కొన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం, బ్రిటిష్ పాలన తొలగించడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహత్మగాంధీకి నివాళులు అర్పించడానికి తామంతా హాజరయ్యామన్నారు. సుభాస్ చంద్రబోస్, లాలాలజపతి రాయ్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటి అనేకమంది స్వాతంత్ర సమరయోధుల ప్రయత్నాలను తెలుసుకుని నూతన శక్తితో ప్రతిఒక్కరూ పాటుపడాల్సి ఉందని ఆయన సూచించారు. ద్వేషం, మతవిశ్వాసాలు, అల్లర్లు, జాతివివక్ష వంటి అంశాలు మనుషుల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్నాయని శాంతి, సహనం, సహాకారం, బంధం.. మనుషులను ఐక్యం చేయగలవని ఆయన అన్నారు. అమెరికా లాంటి గొప్ప దేశ చట్టాలను పాటిస్తున్న పౌరులుగా, భారతీయ గొప్పతనానికి బ్రాండ్అంబాసిడర్లుగా తామంతా గాంధీజీ సూత్రాలను పాటించాలని, ఎవరికివారే మార్గనిర్ధేశం చేసుకుని రెండు దేశాల అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు.

మాజీ సైనికులు, ఇండియన్ నేవీ కామాండర్ గావి కుమార్, ఇండియన్ ఆర్మీ మాజీ మేజర్ రాజ్‌దీప్ ముఖ్యఅతిథులుగా హాజరయి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గావి కుమార్ మాట్లాడుతూ.. ప్రవాసభారతీయుల్లోని దేశభక్తిని ప్రశంసించారు. ముఖ్యంగా చిన్నారులను అభినందించారు.అనంతరం ఎంజీఎంఎన్‌టీ ఆధ్వర్యంలో రెండు పార్క్ బెంచీలను ప్రారంభించారు. బెంచీలను దానం చేసిన కందూరి, కంతిభాయ్ దేశాయ్ కుటుంబాలకు ఎంజీఎంఎన్‌టీ బృందం తరపున ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంవీఎల్ ప్రసాద్, మన్‌హర్ మేఘాని, తయబ్ కుందవాలా, పియూష్ పటేల్, బీఎన్, బెనజిర్ అర్ఫీ, రెహమాన్, సురి త్యాగరాజన్, జాక్ గోధవణి తదితరులు కార్యక్రమం విజయవంతమవడంతో తోడ్పడ్డారు. ఈ సందర్భంగా భారత్, అమెరికా జాతీయ పతాకాలు, మిఠాయిలను జనసందోహానికి అందించారు. అనంతరం కార్యక్రమం విజయవంతమవడానికి సహకరించిన వాలంటీర్లు, హాజరైన ఎంజీఎంఎన్‌టీ కో చైర్‌పర్సన్ సాల్మన్ ఫర్షోరి కృతజ్ఞతలు తెలిపి కార్యక్రమాన్ని ముగించారు.